# లోండా స్టేషన్

## డి. తులసీరామ్

తిరుపతి నుంచి గోవా వెళ్లే దారిలో లోండా అనే చిన్న స్టేషన్ వస్తుంది. అక్కడే నేను రైలు మారాల్సి వస్తుంది. ఆ స్టేషన్‌లో అడుగుపెట్టినప్పుడల్లా నాకు బాండ్..రస్కిన్ బాండ్ గుర్తుకు వస్తాడు. ఆయన కథల్లోలా వుంటుందా స్టేషన్. అక్కడి నిశ్శబ్దం అంటే నాకు చాలా ఇష్టం. ఆ నిశ్శబ్దంలో అపూర్వమైన ప్రశాంతత వుంటుంది. ఆ నిశ్శబ్దంలో నన్ను నేను మైమరచిపోతాను.

ప్రొద్దున్న పదిన్నరకి హరిప్రియ ఎక్స్‌ప్రెస్ దిగి లోండాలో అడుగుపెట్టాను. గోవాకెళ్లే రైలు మధ్యాహ్నం మూడున్నరకి. అంతవరకూ ఆ స్టేషన్‌లోనే కాలక్షేపం చెయ్యాలి. నా బ్యాగును బరబరా లాక్కుంటూ వెళ్లి అక్కడున్న చెక్క బెంచీపై కూలబడ్డాను. కాస్సేపు నాకు పేర్లు తెలియని పచ్చటి చెట్లను చూసి బ్యాగులో నుండి ఒక పుస్తకం బయటకు తీశాను. నాకున్న రెండు వ్యసనాల్లో పుస్తకాలు చదవడం ఒకటి. నేను పుస్తకాలు ఎక్కువగా చదువుతానని తెలిసిన కొంత మంది 'నీలో ప్రాక్టికాలిటీ లేదు. అంతా థియరీయే!' అని విమర్శించారు. వాళ్లని నేను పట్టించుకోలేదు.


నేను పుస్తకాలు చదవడం ఎలా, ఎందుకు మొదలుపెట్టానో మీకు తెలుసా? మీరు ప్రేమించిన అమ్మాయి స్ట్రోక్ ఇచ్చి మరో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని పెళ్లిచేసుకొని అమెరికాలో సెటిలయితే మీకెలా వుంటుంది? నాకూ అలా వుండే పుస్తకం చదవడం ప్రారంభించాను.నేను ప్రేమించిన అమ్మాయి నన్ను వదిలి అమెరికా వెళ్లిందని పాఠకులు నాపై జాలి చూపించనక్కర్లేదు. ఎందుకంటే ప్రస్తుతం నేను సంతోషంగానే వున్నాను!! దేవతలాంటి మరో అమ్మాయిని పెళ్లిచేసుకున్నాను.!! నేను కోతలు కోస్తున్నానుకుంటున్నారా? నా మంగతాయారును చూస్తే మీరూ 'దేవత' అంటారు!బొద్దుగా వున్న బుజ్జిగాడి బుగ్గపై దిష్టిచుక్కలా

మంగలో కూడా నాకో విషయం నచ్చలేదు. పోలిక సరిగ్గా లేదా?ప్చ్...సరిపెట్టుకోండి! మంగ అమ్మ కొంగు చాటు బిడ్డ. తిరుపతిలో తిష్టవేసి రెండు నెలలు అయింది. గోవాకు తీసుకు వద్దామని వెళితే మరో నెల తర్వాత వస్తానంది.

మంగ ఈసారి గోవా వస్తే ఎప్పుడుపడితే అప్పుడు తిరుపతి వెళ్లకుండా వుండడానికి గజదొంగ రాజుగారి నిధి దొంగిలించడానికి ఎలా వ్యూహం పన్నుతారో అలా పకడ్బందిగా వ్యూహం పన్నాను. మంగని డిగ్రీ కాలేజీలో చేర్పిస్తాను. మనదేశంలా ఎప్పుడూ డిఫిసిట్‌లో వుండే నా బడ్జెట్‌లో మంగ కాలేజీ ఫీజుకు కూడా ఫండ్స్ అలాట్ చేస్తాను.

శలభాల గూర్చి చెబుతూ ఏనుగును వర్ణించినట్లు నేను ఎక్కడో మొదలుపెట్టి మరెక్కడికో వెళ్లిపోయాను. స్వామి వివేకానంద గారు రచించిన పుస్తకం చదవడం మొదలుపెట్టాను. నేను కూర్చున్న బెంచీ చివరన మరో వ్యక్తి వచ్చి కూర్చున్నాడు. అతని వయస్సు దాదాపు నలభై సంవత్సరాలు వుండవచ్చు. అటు పొట్టి, ఇటు పొడవు కాకుండా మధ్యలో వున్నాడు. మనిషి ఎర్రగా, బుర్రగా వున్నాడు. రింగుల జుట్టు, అందంగా దువ్వుకొని వున్న క్రాపు. అతని చేతిలో చిన్న ప్లాస్టిక్ కవర్ వుంది. అందులో నుండి ఇంగ్లీష్ వార్తా పత్రిక బయటకి తీసి చదువుకోసాగారు.

నేను అతనితో మాట్లాడకుండా నాపుస్తకంలో పేజీలో తిప్పసాగాను. నాది



ఎక్కువగా మాట్లాడే స్వభావం కాదు. నోరు తెరిస్తే ముత్యాలు రాలిపోతాయేమో అన్నట్లు వుంటాను.

కాస్సేపు తర్వాత అతనే నాతో "నా పేరు కృష్ణారావు" అంటూ మాట కలిపాడు. అతని నోటినుండి గప్పుమని మందువాసన వొస్తే ఎలుక చచ్చిన గదిలోకి అడుగుపెట్టినవాడిలా ముక్కుకు చేయి అడ్డుపెట్టుకున్నాను.

'నీ పేరు కృష్ణారావు అయితే నాకేంటి? కాంతారావు అయితేనాకేంటి?' అన్నట్టు మొహం పెట్టాను. అతను ఏదో చెప్పాలనుకుంటున్నాడు. కానీ చెప్పలేకపోతున్నాడు. నేనతన్నే గమనించసాగాను.

కృష్ణారావు లంచం తీసుకొని పట్టుబడిన రాజకీయనాయకుడిలా చెప్పసాగాడు. "నేను మరో ఇద్దరి స్నేహితులతో కలిసి గోవా వెళ్లాను. సరదాగా ముగ్గురం బీచ్‌లో మందు పుచ్చుకోసాగాము. నా స్నేహితులు మందు తాగి బీచ్‌లో ఒక అమ్మాయిని ఆటపట్టించసాగారు. అప్పటికీ నేను వద్దని చెబుతూనే వున్నాను.! ఆ అమ్మాయి పెద్ద గావుకేక పెట్టింది. దాంతో బీచ్‌లో వున్నవారు మమ్మల్ని బాదటానికి వచ్చారు. నేనక్కడి నుండి కట్టుబట్టల్తో పారిపోయి వచ్చాను. ప్రస్తుతం నా వద్ద చిల్లిగవ్వ లేదు. నేను హుబ్లీ వెళ్లాలి. నిన్నసాయంత్రం నుండి ఏమీ తినలేదు."

అతను చెప్పేదానిలో ఎంత నిజమో ఎంత అబద్ధమో నాకర్థం కాలేదు. 'అప్పు తీసుకొని తిరిగి చెల్లించకుండా తిప్పుకునే వాడి భావన డబ్బులిచ్చినవాడికి తెలిసినట్లు నా ఆలోచనలు కృష్ణారావును ఇట్టే పసిగట్టేసాయి. "నాపై మీకు అనుమానం రావడం సహజమే. కానీ నేను నిజం చెబుతున్నాను. నేను తాగుపోతును కాను. నా బుద్ధి గడ్డితిని స్నేహితులతో గోవా వెళ్లాను. వాళ్లు బలవంతం చేస్తే మందు పుచ్చుకున్నాను." అని సంజాయిషీ ఇస్తున్నట్లు అన్నాడు.

నాకు నమ్మకం కుదరలేదు. ప్రేమించిన అమ్మాయి అమెరికా వెళ్లినప్పటి నుంచి నాకు మనుష్యులపై నమ్మకం తగ్గింది. ఈ విషయం మంగతో చెప్పేరు...నన్ను తన్నుద్ది!

ఈగలు బెల్లం ముక్కను కనుగొన్నట్లు నా అనుమానాన్ని అంత సులువుగా అతను పసిగట్టి "నేను చదువుకున్నవాడిని. డిగ్రీ పూర్తిచేసి బ్యాంకులో పనిచేస్తున్నాను. నాకూ మీ అంత కూతురు వుంది. అబద్ధాలు ఆడాల్సిన అవసరం నాకు లేదు. ఇంతవరకూ ఎవరి ముందు చెయ్యి చాపలేదు. ఇలాంటి పరిస్థితులో చిక్కుకుపోయాను." అన్నాడు.

"నన్ను ఇప్పుడేం చేయమంటారు?" ఎన్నికల సమయంలో నాయకులు ప్రజలను ఓట్లు అడిగినట్లు వినయంగా అడిగాను.

"నేను హుబ్లీ వెళ్లాలి. నా వద్ద డబ్బు లేదు."

నేనులేచి నిలబడి "అయితే పదండి హుబ్లీకి రైలు టిక్కెట్ కొనిపెడతతాను!" అన్నాను. 'మంగే నా వద్ద నుంచి చీర కొనడానికి వంద రూపాయలు రాబట్టలేకపోయింది. ఇక ఈయనో లెక్కా?'

కృష్ణారావు పైకి లేవకుండా "ప్రస్తుతం హుబ్లీకి రైలు లేదు. బస్సులో వెళ్లాలి!" అన్నాడు.

నేను మొహం చిట్లించి "బస్సులోనా...టిక్కెట్ ఎంత?" అడిగాను.

"యాభై రూపాయలు"

"నేను సంపాదించే డబ్బు మంగ రైలు ఛార్జీలకే సరిపోవడం లేదు. భారతదేశం ప్రపంచబ్యాంకు వద్ద నుండి రుణం తెచ్చుకున్నట్లు స్నేహితుని వద్ద నుండి ఈనెల వెయ్యి రూపాయలు అప్పు తీసుకున్నాను" అని ఆలోచిస్తున్న నాతో కృష్ణారావు "డబ్బు గురించి మీరేమి అనుమానపడకండి. నేను ఇంటికి వెళ్లగానే డబ్బులు మీకు మనీయార్డర్ చేస్తాను. మీరు నాకు డబ్బు ఇస్తే మీకో మంచి స్నేహితుడు దొరుకుతాడు. యాభై రూపాయల కోసం మంచి స్నేహితుడిని కోల్పోకండి!"

శత్రురాజ్యాన్ని ఎలా చిత్తు చెయ్యాలో అని చాణుక్యుడు ఆలోచించనట్లు నిమిషం పాటు తీవ్రంగా ఆలోచించాను. బుర్ర వేడెక్కి బరబరా గోక్కుంటూ జేబు నుంచి యాభై రూపాయలు బయటకి తీశాను.

ఆ నోటుని పుచ్చుకుంటూ అతను ఒక్క ఓటుతో యంయల్‌ఏ పదవిని పోగొట్టుకున్న వాడిలా మొహం దీనంగా పెట్టాడు.

'రోడ్డు మీద ఉచితంగా దొరికిన లాటరీ టిక్కెట్టుకు యాభై రూపాయలు తగిలిందని తెలిసినా ఏడుపు మొహం పెట్టేడేమిటబ్బా?' అనుకున్నాను.

"నిన్నటి నుంచి ఏమీ తినలేదు. హుబ్లీ చేరుకునేలోగా సాయంత్రం అవుతుంది. వారంలోగా మీ డబ్బు మీకు చేరుతుంది. పైగా మీకో మంచి స్నేహితుడు దొరుకుతాడు"

నేను కర్ణుడిలా నా బ్యాగు జిప్పు లాగి అందులో నుండి మంగ నాకు ప్రేమగా ఇచ్చిన బిస్కెట్ ప్యాకెట్ అపురూపంగా పైకి తీసి అతనికిచ్చాను.

కళ్యాణ మండపంలో అబ్బాయి తండ్రి కట్నం తక్కువ ఇచ్చిన అమ్మాయి తండ్రిని చూసినట్లు అతను నన్ను చూశాడు.

"పాపం...నిన్నటి నుంచి ఏమీ తినలేదు! ఈరోజు సాయంత్రం వరకూ బిస్కెట్ ప్యాకెట్ ఏమీ సరిపోతుంది!!" అనుకొని అర్ధరూపాయి పీచుమిఠాయి రూపాయి అయిపోయిందని తెలిసిన కుర్రాడిలా బాధపడుతూ నా జేబు నుంచి మరో ఇరవై ఐదు రూపాయలు తీసి అతనికిచ్చాను.


అతను లంకె బిందెలు దొరికిన వాడిలా సంతోషపడుతూ "మీ సహాయం ఎన్నటికీ మరిచిపోలేను! మీకు ఉత్తరాలు వ్రాస్తూ వుంటాను. మీరు ప్రత్యుత్తరము వ్రాయకపోయినా నేను వ్రాస్తూ వుంటాను!! ధన్యవాదాలు" అని అతను నా చిరునామా తీసుకుని వెళ్లిపోయాడు.

కృష్ణారావుకి డబ్బులిచ్చి నేను తీరిగ్గా ఆలోచించసాగాను. అలా ఇచ్చేయడమేనా? అతనెలాంటి వాడో ఏమో? ఇంకా తాగడానికి డబ్బు అడిగాడా? సినిమాలో హీరోయిన్ కష్టాలు తీర్చడానికి హీరో ఆమె అడక్కముందే కన్నీరు దానం చేసినట్లు మంగ ప్రేమగా ఇచ్చిన బిస్కెట్ ప్యాకెట్‌ను కూడా దానం చేసాను. ఇంతకీ కృష్ణారావు డబ్బులు నాకు మనీ ఆర్డర్ చేస్తాడా? చెయ్యడా? వారం రోజుల్లోగా మీ డబ్బులు మీకు అందుతాయన్నాడుగా? వేచి చూద్దాం రావుగారెంత నిజాయితీపరులో! ఇలా నేను చేసిన పని గూర్చి తర్కించుకున్నాను.

నా పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాను. మూడున్నర కావొస్తోంది. నేను ఎక్కాల్సిన రైలు వస్తున్నట్లు ప్రకటన చేసారు. ఇంతలో కృష్ణారావు మళ్లీ వచ్చాడు. అతన్ని విస్తుపోయి చూసి "మీరింకా వెళ్లలేదా? స్టేషన్‌లోనే వున్నారేం?" అనడిగాను.

కృష్ణారావు మళ్లీ మోహమాట పడుతూ "భోజనం చేసి మిమ్మల్ని కలవాలనే తిరిగివచ్చాను. మీరు పుస్తకాలు ఎక్కువగా చదువుతారనకుంటా! నాకూ ఏద్దైనా పుస్తకం ఇవ్వండి. నన్ను నేను మార్చుకోవడానికి! నేను నాకే బొత్తిగా నచ్చడం లేదు!" అన్నాడు.

నా పక్కలో బాంబు పడినట్లు అయింది. దధీ



చిలా వెన్నెముకైనా ఇచ్చేస్తా కానీ పుస్తకం అడిగితే మాత్రం నా ప్రాణాలు పోతాయి. నాకు ఊపిరి ఆడనట్లు అయింది. నా వద్ద వున్నవి అన్నీ కొత్త పుస్తకాలు. ఎంతో ముచ్చటపడి కొనుక్కొన్నాను. నా బడ్జెట్‌లో మంగ చీరకు అలాట్ చేసిన ఫండ్స్ డైవర్ట్ చేసి మరీ కొన్న పుస్తకాలు! ఇంకా చదవను కూడా లేదు!! నేను తడబడుతూ "పుస్తకాలా" అన్నాను.

దూరం నుంచి రైలు కూతపెట్టుకుంటూ వస్తూ కనపడింది ఆ స్టేషన్‌లో రైలు ఏ రెండు నిమిషాలో ఆగుతుంది. నేను లేచి నిలబడి నా బ్యాగు అందుకొన్నాను.

కృష్ణారావు నా చేతిలో వున్న కొత్త పుస్తకం వైపు చూస్తూ "నన్ను నేను మార్చుకోవడానికి మంచి పుస్తకం కావాలి. మీ చేతిలో వున్న పుస్తకం వ్వండి" అన్నాడు.

రైలు వచ్చి ఆగింది. నాకేం చేయాలో అర్థం కావడం లేదు. 'సరైన సమయానికి వచ్చి పట్టుకున్నాడే!" అనుకున్నాను. 'నన్ను నేను మార్చుకుంటాను అంటున్నాడు. అంతకంటే కావల్సిందేముంది? నాకో పుస్తకం తక్కువ కావచ్చు. కానీ ఆ పుస్తకం ఒక భార్యకు మంచి భర్తను ఒక కూతురికి మంచి తండ్రిని ఇవ్వగలిగితే అంతకంటే కావల్సిందేముంది?' అనుకొని నా చేతిలో వున్న స్వామి వివేకానంద వ్రాసిన పుస్తకాన్ని అతనికిచ్చేసాను. అతను సంతోషంగా దాన్ని తీసుకొని నమస్కారం పెడుతూ వెళ్లిపోయాడు.

నేను రైలెక్కాను.

వారం రోజుల పాటు నేను కృష్ణారావు కోసం ఎదురుచూసాను. నేను అతన్ని మరిచిపోలేదు. ఎందుకంటే నేను కృష్ణారావు నిజాయితీని పరీక్షించదలుచుకున్నాను. కాబట్టి రెండు వారాల వరకూ అతని వద్ద నుండి ఏ సమాచారమూ లేదు!

దేవుడు మనిషికిచ్చిన గొప్ప వరం...మరిచిపోవడం

కొన్ని రోజులకు నేను కృష్ణారావు గురించి పూర్తిగా మరిచిపోయాను.

★★★

గుర్రబండి చక్రంలా కాలం గిర్రున నాలుగు సంవత్సరాలు తిరిగిపోయింది. నేను తిరుపతి నుండి గోవా వెళ్తూ లోండా స్టేషన్‌లో ఆగాను. నాకు కూతురు పుట్టింది. నా హృదయం వుప్పొంగిపోయింది. తిరుపతి వెళ్లి కూతురును చూసి వస్తున్నాను. నేనున్న ఆర్థికపరిస్థితుల్లో ఒక బిడ్డను మాత్రమే సరిగ్గా పెంచి, మంచి విద్యను అందివ్వగలనని అనిపించి ఆపరేషన్ చేయించుకొన్నాను.


మనలో మాట... ఈ పనికి అందరూ నన్ను మెచ్చుకున్నారు కూడా!

మంగ డిగ్రీ పూర్తి చేసింది. ఇప్పుడు నాతో ముద్దుగా ఇంగ్లీషులో కూడా మాట్లాడగలుగుతోంది. నా పిచ్చి మంగకు కూడా పట్టింది. ఆమెకు తెలుగు ఇంగ్లీష్ లిటరేచర్‌పై మక్కువ ఏర్పడింది. మంగ డిగ్రీ పూర్తవ్వగానే మళ్లీ తిరుపతి వెళ్లిపోయింది. ఈ సారి గోవా వస్తే పోస్టుగ్రాడ్యుయేషన్ చేయిద్దామనుకుంటున్నాను.

నా బ్యాగులో నుండి లియోటాల్‌స్టాయ్ రచించిన వార్ అండ్ పీస్ పుస్తకం బయటకు తీసాను. ఆ పుస్తకం మంగ నా పుట్టినరోజుకి బహుమతిగా ఇచ్చింది. కొత్త పుస్తకాన్ని వేళ్లతో స్పృశించనప్పుడు కలిగే ఆనందం మాటల్లో చెప్పలేనిది.

'నా కూతురు ఏమి చేస్తూ వుంటుంది? మంగను పీక్కుతింటోందేమో!' అనుకుంటూ పుస్తకం తెరిచి చదువుకోసాగను.

నేను కూర్చున్న బెంచీపై మరో వ్యక్తి వచ్చి చతికిల పడ్డాడు. తాగుబోతులా అతని కళ్లు ఎర్రగా వున్నాయి. మనిషి చిక్కిశల్యమై వున్నాడు. అతన్ని ముందు ఎక్కడో చూసినట్లు అనిపించింది.




ఎప్పుడు? ఎక్కడ చూసానో మాత్రం గుర్తురాలేదు. అతని చేతిలో ప్లాస్టిక్ కవర్ వుంది. అందులో నుంచి ఇంగ్లీష్ వారపత్రిక బయటకి తీసి చదవసాగాడు.

కాస్సేపటికి అతను నాతో మాట కలుపుతూ 'నా పేరు మోహన్‌రావు' అన్నాడు. అతని నోటి నుంచి మందు వాసన వచ్చి నేను అప్రయత్నంగా ముక్కుకు చేయి అడ్డుపెట్టుకున్నాను. అప్పుడు నాకు అతనెవరో తెలిసింది.!

అతను మళ్లీ మాట్లాడబోయే ముందు నేను అన్నాను. "మీరు మీ స్నేహితులతో కలిసి గోవా వెళ్లారు. అక్కడే బీచిలో మీ స్నేహితులు ఓ అమ్మాయిని ఆటపట్టించారు. ఆ అమ్మాయి కేకపెడితే అక్కడి వాళ్లు మీ మెడళ్లకు పట్టిన బూజు దులపడానికి వచ్చారు. దాంతో మీరు పారిపోయి కట్టుబట్టలతో ఇక్కడికి చేరుకున్నారు. అంతేనా?"

మోహనరావు ఉరఫ్ కృష్ణారావు నా వంక చకితులై చూసి 'సహదేవుడిలా జోతిష్యం చెబుతున్నారు! నిజంగా అలాగే జరిగింది!" అన్నాడు.

"నేను జ్యోతిష్యం చెప్పడం లేదు! నాలుగేళ్ల ముందు ఇదే కథ చెప్పి నా వద్ద నుండి డబ్బు కాజేశావు గుర్తులేదా?" అనడిగాను కోపంగా

అతను తడబడుతూ "అది...అది...నేను చెప్పేది నిజం!" అన్నాడు.

"నీకు కాళ్లు చేతులూ బాగానే వున్నాయి. ఎదుటి వాడి సైకాలజీని అర్థం చేసుకొని తెలివిగా మాట్లాడగలుగుతున్నావు. అంతటి తెలివితేటలున్న వాడవి ఇతరులను మోసం చేసి ఎందుకు బ్రతుకుతున్నావు?"

"మీరు ఎవరినో చూసి మరెవరో అనుకుంటున్నారు" సంజాయిషీ చెబుతున్నట్లు అన్నాడు.

"పగటి పూటే తాగి ఇలా అబద్ధాలాడుతున్నావు. నీతో మాట్లాడడం నాకు ఇష్టం లేదు!" కుంబడద్దలు కొట్టినట్లు ఖచ్చితంగా చెప్పాను.

"నాకు నీ అంత కూతురు వుంది. దానిపై ప్రమాణం చేసి చెపుతున్నాను! నేను చెప్పేది నిజం!!" అన్నాడు కృష్ణారావు.

'ఇతనికి భార్యాపిల్లలున్నారేమో! వాళ్లకి ఇలా మోసం చేసే తిండి పెడుతున్నాడేమో! లేక డబ్బులు తాగడానికి ఖర్చుపెడుతున్నాడా? కృష్ణారావుకు నిజంగా భార్య వుందా? ఆమె చదువుకుందా? లేక కూలీ పనిచేస్తుందా? తాగుపోతు ఆమెను హింసించి డబ్బు గుంజుతుంటాడా? ఇతనికి కూతురుందా? పాపం.. ఆ అమ్మాయిని చదివిస్తున్నాడా? లేక ఆమెను కూడా కూలీకి పంపిస్తున్నాడా?' కృష్ణారావు భార్యపై నాకు జాలి కలిగింది. ఆమె ఈ తాగుబోతుతో ఎన్ని కష్టాలు పడుతోందో? ఒక స్త్రీ రూపాయి చాక్లెట్ కోసం కూడా మగవానిపై ఆర్థికంగా ఆధారపడే పితృస్వామ్య సమాజంపై నాకు చీదరింపు కలిగింది.

నా జేబులో చెయ్యిపెట్టి నలభై రూపాయలు తీసి అతనికిస్తూ " ఎందుకు వీటికోసం అబద్ధాలాడతావు? ఈ డబ్బుతో తాగకుండా నీ భార్యకీ, కూతురికీ నాలుగు మెతుకులు అన్నంపెట్టు" అన్నాను.

అక్కడ వుండడం ఇష్టంలేక నా బ్యాగు తీసుకొని మరో బెంచీవైపు వెళ్లసాగాను. అతను నాలాంటి వాళ్లను ఎంతమందిని మోసం చేసి ఉన్నాడో? ఇంకా ఎంతమందిని మోసం చేస్తాడో? అతనలా మోసం చేస్తే నిజంగా అవసరమున్నవారు వచ్చి సహాయం కోరితే నేను ఆదుకుంటానా? కృష్ణారావు 'కూతురు' అనగానే నేను చప్పబడిపోయాను.

'మేథావి తప్పు చేయకుండా జాగ్రత్త పడతాడు. తెలివైన వాడు చేసిన తప్పే మళ్లీ మళ్లీ చేస్తుంటాడు. మనుష్యులు ఈ మూడు రకాలుగా వుంటారు. కృష్ణారావు మోసగాడని తెలిసినా అతనికి డబ్బులిచ్చాను. నేనో పెద్ద మూర్ఖుడిని" అనుకుంటూ ముందుకి వెళ్లిపోయాను.